ముగిసిన గ్రూప్-1 పరీక్షలు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 27 : గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష-2024 ఆదివారంతో ముగిశాయి. కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలోని రెండు పరీక్షా కేంద్రాలలో గ్రూప్-1 పరీక్ష రాసేందుకు అభ్యర్థులు చివరి రోజు సమయంలోపే వచ్చారు. ఈ సంధర్భంగా సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి నేతృత్వంలో ఎస్ఐలు మధుసూదనాచారి, అంకం నరేశ్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా చివరి రోజు కోఠి మహిళా వర్సిటీలోని వింగ్ -ఏలో 792 మంది అభ్యర్థులకు గాను 721 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వింగ్-బీలో 864 మంది అభ్యర్థులకు గాను 777 మంది పరీక్షకు హాజరయ్యారు.ఇదిలా ఉండగా వివేక్ వర్ధిని కళాశాలలో 528 మంది అభ్యర్థులకు గాను 443 మంది పరీక్షకు హాజరయ్యారని సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలు నేటికీ వివక్షకు గురికావడం బాధాకరం

అబిడ్స్, అక్టోబర్ 27 : ఎస్సీ, ఎస్టీలు నేటికీ వివక్షకు గురి కావడం బాధాకరమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోత్ హుస్సేన్ అన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా ఎస్బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఆదివారం అబిడ్స్ పర్వానా హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్బీఐ బ్యాంకు సీజీఎం రాజేశ్‌కుమార్‌తో కలిసి జటోత్ హుస్సేన్ మాట్లాడారు. 33 సంవత్సరాల తరువాత తెలుగు బిడ్డకు ఎస్‌టీ కమిషన్ సభ్యుడి పదవి దక్కిందని, జాతి బాగు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని కొంత మంది దుర్వినియోగం చేస్తున్నారని దీంతో నిజమైన బాధితులు నష్ట పోతున్నారన్నారు. ఎస్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్, ప్రెసిడెంట్ శంకర్, డి.సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

పావు కి.మీ.కు 13 నెలలు

అంబర్‌పేట, శ్రీరమణ చౌరస్తాలో తవ్వి వదిలేసిన గుంతలు

- అయినా పూర్తికాని శ్రీరమణ చౌరస్తా ఫ్లైఓవర్ బ్రిడ్జి
- ఇష్టారాజ్యంగా నేషనల్ హైవే ఆర్ అండ్ బీ అధికారుల తీరు
- వాహనాల రాకపోకలతో బస్తీ వాసుల అష్టకష్టాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అంబర్‌పేట, అక్టోబర్ 27: నేషనల్ హైవే ఆర్ అండ్ బీ అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా అంబర్‌పేట ప్రజలు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. నత్తనడకన జరుగుతున్న ఛే నంబర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా శ్రీరమణ చౌరస్తా నుంచి ఛే నంబర్ వరకు ఈ సమస్య తీవ్రంగా ఉంది.

9 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి..

పావుకిలో మీటర్ వరకు ఉన్న ఈ పనులను కేవలం 9 నెలల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొన్నారు. కానీ 13 నెలలు గడిచినా ఇంకా పూర్తి కాలేదు. అధికారుల అలసత్వం, సంబంధిత పనులు చేసే సంస్థ సరైన ప్రణాళిక, డిజైన్ లేకపోవడం, పలుమార్లు డిజైన్‌ను మార్చడంతో పనుల్లో ఆలస్యం జరుగుతున్నది. దీంతో ఇక్కడి ప్రజలతో పాటు వాహనదారులు ఇబ్బందులపాలవుతున్నారు. ఈ ప్రాంతంలో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. పనులు ఎలా జరుగుతున్నాయనే విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఫ్లైఓవర్ కింద రోడ్డును పూర్తి చేసినా ప్రజలకు కొంత మేర ఇబ్బందులు తప్పేవి. కానీ ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం కూడా ఆపేశారు. ఎక్కడపడితే అక్కడ గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో వాహనదారులు గుంతలు ఉన్న విషయం గమనించక అందులో పడి గాయాలపాలవుతున్నారు. ఈ రోడ్డు బంద్ ఉండటంతో గత నెల 17వ తేదీన ఆటోలో ప్రయాణిస్తున్న ఓ కుటుంబానికి యాక్సిడెంట్ కావడంతో మొత్తం కుటుంబమే దవాఖానలో చేరింది. రూ.3 లక్షల వరకు ఖర్చు అయింది. ఇప్పటికీ మంచం పైనే ఉన్నారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. ఈ రోడ్డు పనులు పూర్తయి ఉంటే ఇలాంటి ప్రమాదాలు జరిగేవి కావు.

అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు

వ్యాపారస్తులకు నష్టం..

ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా ఛే నంబర్ నుంచి శ్రీరమణ చౌరస్తా వరకు గల వ్యాపారస్తులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. పనులు తొందరగా పూర్తి కాకపోవడంతో కోట్లల్లో నష్టపోయారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా ఒక్క శ్రీరమణ థియేటర్‌కే రూ.2 కోట్ల నష్టం వచ్చిందని నిర్మాహకులు తెలిపారు. అలాగే ఇతర వ్యాపార సంస్థలు కూడా బాగా నష్టపోయారు. ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా తాము రోడ్డున పడాల్సి వచ్చిందని పలువురు వ్యాపారస్తులు వాపోయారు. ఇదిలా ఉంటే వాహనదారులు గల్లీలో నుంచి వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. శ్రీరమణ నుంచి ఛే నంబర్ వరకు 5 నిమిషాల్లో వెళ్లవచ్చు. కానీ చుట్టూ తిరిగి పోవడానికి దాదాపు 2 గంటల సమయం పడుతున్నది. పావు కిలో మీటర్ ప్రయాణానికి 2 గంటలు పడుతున్న దుస్థితి.

వెంటనే పూర్తి చేయాలి..

ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో చాలా మంది నష్టపోతున్నారు. 13 నెలలు అవుతున్నా ఇంకా పూర్తి కాలేదు. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. వాళ్లు అసలే పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకొని పనులు వెంటనే పూర్తి చేయాలి

-ఎర్రబోలు నర్సింహారెడ్డి, స్థానికుడు

వేదమంటే భగవత్ స్వరూపం

జ్ఞానాభివృద్ధికి సోపానం భగద్గీత అని పుష్పగిరి పీఠాధిపతి శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతిస్వామి అన్నారు. రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో సత్కళాభారతి సంస్థ 28వ వార్షికోత్సవం సందర్భంగా 'వేదాశీర్వచనమ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వందమంది పండితులు వేదపఠనం చేశారు. అనంతరం పండితులను సత్కరించి స్వామిజీ ఆశీస్సులు అందజేశారు. ముఖ్య అతిథులుగా పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి హాజరై మాట్లాడుతూ.. మన భారతీయ సనాతన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కోలేటి దామోదర్ గుప్తా, ఎస్.రాజమౌళి, పి.వెంకటేశ్వర్లు, సత్కళాభారతి సత్యనారాయణ తదితరులతో కలిసి వందమంది వేదపండితులను సత్కరించారు.

– రవీంద్రభారతి

'నానీ కిరణాలు' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్.గోపీ

రవీంద్రభారతి,అక్టోబర్ 27 : కంచనపల్లి రవికాంత్ రచించిన 'నానీ కిరణాలు' గ్రంథావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య ఎన్.గోపీ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'నానీ కిరణాలు' కవితా సంపుటిలో ఎంతో వస్తు వైవిధ్యం ఉందన్నారు. రవికాంత్ కవిత్వంలో మహిళల పట్ల సానుభూతి కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య సూర్యధనంజయ్, డా.ఎస్.రఘు, అడిషన్ కలెక్టర్ జి.శ్యాంప్రసాద్‌లాల్, హరీశ్‌గౌడ్, తగుళ్ల గోపాల్, వెంకటేశ్వరరెడ్డి, రఘువీర్, ప్రతాప్, దాసోజు లలిత, కూరెళ్ల శ్రీనివాస్, శంకర్ కార్టూనిస్ట్ బంగారు బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

రహీంపురా ప్లే గ్రౌండ్స్‌లో జై లోధేశ్వర్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా మాజీ కార్పొరేటర్, ఖైరతాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరిసింగ్ క్రీడాకారులను కలిసి అభినందనలు తెలిపారు.

– అబిడ్స్, అక్టోబర్ 27

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య గురువు డాక్టర్ విమల నీలం శిష్యబృందంచే ప్రాచీన కూచిపూడి నృత్యప్రదర్శన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వెంపటి చిన్న సత్యం కుమార్తె కామేశ్వరి, బాల త్రిపుర సుందరి, పసుమర్తి వెంకటేశ్వర శర్మ, డా.పసుమర్తి శ్రీనివాస్‌శర్మ, హీరో శ్రీనివాస్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి డాక్టర్ విమల నీలం శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రారంభించారు.

– రవీంద్రభారతి,అక్టోబర్ 27

అక్షరాస్యతలో దేశంలో కంటే తెలంగాణ వెనుకంజ

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 27: విద్యానాణ్యత లోపించడంతో అక్షరాస్యతలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ఎంతో వెనుకబడి ఉందని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. ఆదివారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో తెలంగాణ గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ సంఘం(టీఆర్ఈఐటీఏ) ఆధ్వర్యంలో సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై సదస్సు, రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేసిన ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు అత్యధిక డబ్బులు పెట్టే రాష్ట్రం తెలంగాణ, ఆంధ్ర మాత్రమే అన్నారు. అంతే కాకుండా ఫలితాలలో వెనుకబడిన రాష్ట్రాలు తెలుగు రాష్ట్రాలేనని అన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు విద్యా బోధనా సిబ్బందిని నియమించాలని అన్నారు. అప్పుడే విద్యా నాణ్యత పెంపొంది సంపూర్ణ అక్షరాస్యత వస్తుందని లేని పక్షంలో విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగి విద్యా వ్యవస్థ సంక్షోభంలో పడుతుందని అన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్, టీఆర్ఈఐటీఏ సంఘం అధ్యక్షుడు వీఆర్ గోవర్ధన్‌రెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి కె.సంజీవ్, సెక్రటరీ సీహెచ్ రమణకుమార్‌లు మాట్లాడారు. టీఆర్ఈఐటీఏ సంఘం గౌరవ అధ్యక్షుడు రవిచందర్, మాజీ అధ్యక్షురాలు కె.రమాదేవి, సంఘం సలహాదారులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్‌తో దేహ ధారుఢ్యం

బాడీబిల్డింగ్‌తో దేహ ధారుఢ్యం పెంచుకోవడానికి దోహదం చేస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. బంజారాహిల్స్‌లో జరిగిన నరేశ్ క్లాసిక్ బాడీబిల్డింగ్ పోటీలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ యువ నాయకుడు ఫహీం ఖురేషీ, నిర్వాహకులు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 27

బీసీ కులగణనకు కృషి చేయాలి

మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న బీసీ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నందగోపాల్, తదితరులు

కాచిగూడ, అక్టోబర్ 27: జనగణనలో కులగణన పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న బీసీ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి పరిష్కరించేలా కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనగణనలో కులగణన పూర్తి చేయాలని కోరుతూ ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, క్రీమిలేయర్ విధానాన్ని వెంటనే రద్దు చేసేలా, ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందగోపాల్, ఉదయ్‌కుమార్, విజయ్‌కుమార్ ముదిరాజ్, హరితిలక్‌సింగ్ పాల్గొన్నారు.

లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమారికి సన్మానం

లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమారిని కార్వాన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎ.కృష్ణ(మిత్ర) మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హన్మంతరావు జీవితం మీద రూపొందించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి వచ్చిన మీరా కుమారిని మిత్ర కృష్ణ సన్మానించారు.

-మెహిదీపట్నం, అక్టోబర్ 27

మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి మృతి

అంబర్‌పేట, అక్టోబర్ 27 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఎస్. ఇంద్రసేనారెడ్డి(81) మృతి చెందారు. ఆదివారం సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఇంద్రసేనారెడ్డి కాలేజీ రోజుల్లో విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. 1960లో ఉస్మానియా యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, 1972లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, 1975 లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, ఏఐసీసీ సభ్యుడిగా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య మంత్రివర్గంలో మొదటి రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా, 1982-83లో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, ఏపీఐడీసీ చైర్మన్‌గా విశేష సేవలందించారు. ఇంద్రసేన్‌కు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు సోదరుడు ఎస్.హరినాథ్‌రెడ్డి తెలిపారు.

సంతాపం..

అబిడ్స్, అక్టోబర్ 27 : మాజీ ఎమ్మెల్సీ, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యుడు ఎస్. ఇంద్రసేనారెడ్డి మృతి పట్ల సొసైటీ కార్యదర్శి బి. సురేందర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, ఎగ్జిబిషన్ సొసైటీ, ఎకనామిక్ కమిటీ సభ్యులుగా కొనసాగుతూ విద్యార్థి దశ నుంచే రాజకీయాలలోకి వచ్చారని, ఓయూ స్టూడెంట్స్ యూనియన్, ఏపీ యూత్ కాంగ్రెస్, ఇండియన్ యూత్ కాంగ్రెస్, ఏపీ కాంగ్రెస్, ఏఐసీసీతో పాటు కాంగ్రెస్ పార్టీలోని పలు విభాగాలలో కీలక పదవులలో పని చేశారని కొనియాడారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కాచిగూడ,అక్టోబర్ 27: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన షేక్‌షాఫీ జానీమియా ఈ నెల 24 న కాచిగూడ రైల్వేస్టేషన్‌లో రైలు దిగి బయటకు వస్తుండగా రైల్వేస్టేషన్ అవరణలో ద్విచక్రవాహనం ఢీకొనడంతో జానీమియాకు కుడి కాలకు గాయమైందని పోలీసులు తెలిపారు. బాధితుని ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నేతల అరెస్ట్

అబిడ్స్, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు నివాసముండే ఓరియన్ విల్లాలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులను అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు అశీష్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు అడ్డుకోగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావుకు రోజు రోజుకూ ప్రజలలో ఆదరణ పెరుగుతోందని, అది చూసి ఓర్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కార్వాన్, అక్టోబర్27 : మూసీలో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్ మూసీ పరీవాహక ప్రాంతమైన గిర్కపల్లిలో దాదాపు 60 ఏండ్ల వయసున్న ఓ మహిళ మూసీలో పడి ఉండడంతో సమాచారం అందుకున్న డీఆర్ఎఫ్ బృందం ఆమె బయటకు తీసే సమయానికి చనిపోయింది. కుల్సుంపురా పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కాగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అతిథులను సత్కరిస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్

రవీంద్రభారతి,అక్టోబర్ 27 : దేశంలో అవినీతి అంతం కావాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం-2005 అక్టోబర్ 12న అమలులోకి వచ్చిన వచ్చిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, గుండెల రాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ కమిషనర్ లేక వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే కమిషనర్లను నియమించాలని అన్నారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీఐ కమిషనర్లను వెంటనే నియమించాలని, లేకుంటే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని అన్నారు. వేలాది మందితో రాష్ట్ర సచివాలయాన్ని, ఆర్టీఐ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ నాయకులను సమాచార చట్టం కిందికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో చింతల రాఘవేందర్ ముదిరాజ్, గంగప్రియరెడ్డి, ఎడ్ల అనితారెడ్డి, పడిగె ప్రశాంత్, గౌరవేని సుమన్, వినయ్‌కుమార్, భానుప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చిన్న విషయమై ఇరు వర్గాల ఘర్షణ

పరస్పరం ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 27 : చిన్న విషయమై గొడవ పడ్డ రెండు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసిన ఘటన ఆదివారం సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. బొగ్గులకుంటలోని మయూర్ పాన్ షాపులో హెల్పర్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ పాండే(48) సాయంత్రం 3.30 గంటలకు పనులు ముగించు కొని స్నేహితులు రాజేందర్ యాదవ్,సునీల్ యాదవ్‌లతో కలిసి కాలినడకన గత గదికి వెళ్లే క్రమంలో హనుమాన్‌టేక్డీలోని పాత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోగానే అకారణంగా అక్కడే ఉన్న ముగ్గురు వ్యక్తులు దుర్భాష లాడుతూ అడ్డుకున్నారు. ఎందుకు దుర్భాషలాడుతున్నారని సునీల్ యాదవ్ అడిగగా.. కోపోద్రిక్తులైన యువకులు తమపై లాఠీలతో దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను గాయపరిచిన వంశీ, రామ్, మనీష్‌లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇదిలా ఉండగా కోఠి ట్రూప్‌బజార్‌కు చెందిన వంశీ కూడా సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరు వర్గాలను వైద్యసేవల నిమిత్తం దవాఖానకు తరలించారు.

ఆటోరిక్షాల్లోనే చెత్తను వేయాలి

కాచిగూడ, అక్టోబర్ 27: ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా ఆటోరిక్షాల్లో వేసి పరిశుభ్రతను పాటించాలని కాచిగూడ డిపో మేనేజర్ రఘు కోరారు. కొన్ని నెలలుగా గుర్తుతెలియని వ్యక్తులు ఇతర ప్రాంతాల నుంచి చెత్తను తెచ్చి కాచిగూడ ఆర్టీసీ డిపో గోడ పక్కన పాడేసి వెళ్తున్నారని, దీంతో డిపోలోకి తీవ్ర దుర్గంధం వస్తుందని అన్నారు. చెత్తను ఆర్టీసీ డిపో గోడ సమీపంలో వేయకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్ఓ హేమలత తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కార్వాన్ యాదవ్ సంఘం సదర్ ఉత్సవంలో ప్రతినిధులు

ఉత్సాహంగా సదర్

కార్వాన్, అక్టోబర్27 : యాదవులు నిర్వహించే సదర్ యాదవుల జీవన శైలిని, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్ కుమార్ యాదవ్ అన్నారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మందడి అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు మందడి అనీల్‌కుమార్‌యాదవ్‌ల అధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన యాదవుల సదర్ ఉత్సవంలో కార్వాన్ యాదవ సంఘం ప్రతినిధులు దున్నలను తీసుకొని ఉత్సాహంగా కలిసి వెళ్లారు. కార్వాన్ యాదవ సంగం ప్రతినిధులు అన్నూ యాదవ్, సందేష్ యాదవ్, ప్రేంకుమార్ యాదవ్, సుధాకర్ యాదవ్, వెంకటేశ్‌యాదవ్, లింగం యాదవ్, శ్రీనివాస్ యాదవ్, క్రిష్ణ యాదవ్, వినోద్ యాదవ్, అర్వింద్ యాదవ్, వేణు యాదవ్, కిశోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు పోస్టర్ ఆవిష్కరణ

అంబర్‌పేట, అక్టోబర్ 27: టీడీపీ సీనియర్ నాయకుడు ఏడెల్లి భానుప్రకాశ్ రూపొందించిన టీడీపీ సభ్యత్వ నమోదు పోస్టర్‌ను ఆ పార్టీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఏడెల్లి సత్యనారాయణ, కిరణ్‌కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంఐఎం పార్టీ కృషి చేస్తున్నదని ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ అన్నారు. ఆదివారం కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీని కలిసి సమస్యలు విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 27

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 27

రైళ్లలో దొంగతనం

కాచిగూడ,అక్టోబర్ 27: మైసూర్ రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదు, ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. చింతలకుంటలోని అభినవ్‌నగర్‌కు చెందిన ఎస్.రత్నాకుమారి(62)మైసూర్ రైల్లో కాచిగూడ రైల్వే స్టేషన్ 3వ ప్లాట్‌ఫాంలో దిగి బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న 15 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,900, ఎస్‌బీఐ కార్డులను దొంగిలించారు. ఆదివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపారు.

వెంకటాద్రి రైల్లో ..

మల్కాజిగిరి, భవానీనగర్‌కు చెందిన పద్మ గోపాల్‌శర్మ(42)వెంకటాద్రి రైల్లో మహబూబ్‌నగర్ నుంచి కాచిగూడకు వస్తుండగా షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌లో బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న 2 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 వేలు, ఖరీదైన 2 గడియారాలు దొంగిలించారు. ఆదివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపారు.

మందిరానికి వెళ్లిన వ్యాపారి అదృశ్యం

అజయ్ కుమార్ భాటి(ఫైల్)

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 27 : వ్యాపారి అదృశ్యమైన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భగవాన్‌గంజ్, బేగం బజార్‌కు చెందిన అజయ్ కుమార్ భాటి వ్యాపారి. కాగా మూడు నెలలుగా వ్యాపారంలో నష్టాలు రావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 24న ఉదయం 9 గంటలకు కాచిగూడలోని శ్యాంబాబా మందిర్‌కు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారు పడిన భార్య నేహా భాటి అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.